# పండగొచ్చింది

బాబ్జీకి పన్నెండేళ్లొచ్చాయి.

పన్నెండేళ్ళ బాబ్జీ చూడ్డానికి పదిహేనేళ్ళవాడిలా వుంటాడు. మిగల పండిన జాంపండులా వుంటాడు. అందుకేనేమో అతన్ని ఇంట్లో తల్లిదండ్రులూ, నౌకర్లూ చాకర్లూ "పండుబాబూ" అని పిలుస్తారు.

బాబ్జీ పిలిస్తే పలకడానికి పదిమంది నౌకర్లు ఎప్పుడూ సిద్ధంగా వుంటారు. అతను కాలు కింద పెడితే కందిపోకుండా, కమిలిపోకుండా ఇల్లంతా మెత్తటి తివాచీలు పరిచివుంటాయి. ఆకలేస్తే తినడానికీ, ఆకలి వెయ్యకపోయినా తినడానికీ వెయ్యిరకాల తినుబండారాలింటినిండా వుంటాయి.

బాబ్జీకి అసలు ఆకలంటే ఏమిటో తెలీదు. బాబ్జీ తండ్రి పేరు రాజారావ్. రాజారావ్ పేరు తెలీని వాళ్ళు ఆ సిటీలో ఎవరూ లేరు. రాజారావ్‌ని మించిన ధనవంతులు ఆ సిటీలో ఒకరిద్దరికన్నా లేరు.

రాజారావ్‌కి చాలా పెద్ద ప్రాపర్టీ ఉంది. సీలింగు

లేకుండా పెరిగిన ప్రాపర్టీలాంటి బొజ్జ వుంది. బొజ్జ కరగడానికి చాలా కాలంగా మందులు తింటున్నా బొజ్జ పెరిగిందేగాని తరగలేదు అతని బొజ్జవల్ల అధమ పక్షం అరడజనుమంది డాక్టర్ల ఆదాయం పెరిగింది. అంచేత రాజారావ్ బొజ్జంటే చాలామందికి గౌరవంకూడా వుంది. బొజ్జ పెరిగినకొద్దీ రాజారావుకి తన బొజ్జమీద ప్రేమ పెరిగింది, దరిమిలా గర్వం కూడా కలిగింది. ఇంతపెద్ద బొజ్జ, యింత అందమైన బొజ్జ ఎవడికుంది గనక అని తనలో తాను మురిసిపోతుంటాడు.

ఆ రోజు అలాగే - డ్రాయింగ్ రూమ్‌లో అరమైలు వెడల్పున్న సోఫాలో అరమోడ్పు కన్నులతో. బొజ్జ తడువుకుని మురిసిపోతూ కూర్చున్న రాజారావు దగ్గరకొచ్చి - ముద్దు ముద్దుగా - "నాకో చాక్‌లేట్ కొనిపెట్టవా" అన్నంత ముద్దుగా, తేలిగ్గా - "నాకో కొత్తకారు కొనిపెట్టవా నాన్నా?" - అని అడిగాడు బాబ్జీ

రాజారావుకి కొడుకుమీద కోపం వచ్చింది - విమానం కొనిపెట్టమని అడగనందుకు ఆ తరువాత ఆశ్చర్యం వేసింది - విమానంలాంటి కార్లు యిప్పటికే రెండు వుండగా మళ్ళీ కొత్తకారు ఎందుకడిగాడా అని. ఆ మాటే కొడుకు నడిగాడు.

"మన కార్లు పాతవై పోయాయి నాన్నా! మా స్కూలు కెళ్ళొచ్చే రోడ్డు పాడై పోయింది; ఆ గతుకుల్లో మన కార్లంత సుఖంగా నడవటంలేదు" - అన్నాడు బాబ్జీ.

రాజారావుకి ఆ నగరపాలక సంస్థమీద కోప మొచ్చింది - తన కొడుకు స్కూల్‌కి వెళ్ళేరోడ్డు అంత ఛండాలంగా వున్నందుకు.

ఆ తర్వాత భారతదేశంమీద కోపమొచ్చింది. 'ఛీ! వెధవ కంట్రీ! మంచికార్లే దొరికి చావవు!' అని తిట్టు కున్నాడు.

'ఓకే మై సన్! ఐ విల్ గెటు యూ ది బెస్ట్ కార్ ఎవైలబుల్ ఇన్ ది కంట్రీ! డోంట్ వర్రీ'' - అని కొడుక్కి హామీ యిచ్చాడు.

బాబ్జీకి పన్నెం డేళ్ళొచ్చాయి. అతనికి ఏడాదికి కనీసం పన్నెండుసార్లేనా పుట్టిన్రోజు పండగలు జరుగు తాయి. అతని లేటెస్ట్ పుట్టిన్రోజు పండగనాడు—— దేశ మంతటిలోకి బెస్టుకారు లేటెస్టు మోడల్ కారు కొని కొడుక్కి ప్రెజెంటేషన్‌గా యిచ్చాడు రాజారావు.

○ ○ ○

బుచ్చిబాబుకి ఆరేళ్ళొచ్చాయి.

ఆరేళ్ళ బుచ్చిబాబు చూడ్డానికి ఆరేళ్ళవాడిలాగే వుంటాడు.

బుచ్చిబాబు తండ్రి సుబ్బారావుకి గుమాస్తాగా పదేళ్ళ సర్వీసుంది. పదేళ్ళనుంచి పెరిగిన సుబ్బారావు జీతం నెలలో ఇరవైరోజులకి మాత్రమే సరిపోయేట్టుగా పెరిగింది.

ఇరవయ్యోకటో రోజునుంచీ సుబ్బారావు అప్పులూ, తప్పులూ చెయ్యడం మొదలెడతాడు.

సుబ్బారావు చేసిన తప్పులకి ఫలితంగా అతనికి ఒక పెళ్ళామూ, బుచ్చిబాబు కాక మరో ఇద్దరు బాబులూ, యిద్దరు కూతుళ్ళూ వున్నారు

సుబ్బారావు పెళ్ళానికి ఉబ్బసమో క్షయో తెలీని జబ్బుంది. ఆ జబ్బు పూర్తిగా నయం చేయించడానికి డబ్బు లేక, ఇన్‌స్టాల్‌మెంటు పద్ధతిమీద డబ్బిస్తాను, నయంచెయ్యమని చాలామంది డాక్టర్లని అడిగాడు సుబ్బారావు అలా వీల్లేదు పొమ్మన్నారు డాక్టర్లు. అంచేత పత్రికలలో ప్రకటించబడే "గ్యారంటీ చికిత్స" తాలూకు మందులు చవగ్గా కొని తనే పెళ్ళానికి వైద్యం చేస్తూ వుంటాడు.

తన అప్పులూ, తప్పులూ, పెళ్ళాం జబ్బూ, ఆఫీసులో మేనేజరూ, జీతమూ, రొటీన్ జీవితమూ ఇవన్నీ గంటకి యాభైసార్లు గుర్తొచ్చి - వందసార్లు "ఛీ, ఛీ" అనుకుంటూ వుంటాడు సుబ్బారావు. ఆ వేళ అవేమీ గుర్తురాని ఒక సుముహూర్తాన - అతని ఆరేళ్ళ సుపుత్రుడు బుచ్చిబాబు అతని దగ్గరకొచ్చి - ముద్దు ముద్దుగా "నాన్నా! నాకో మూడుచక్రాల సైకిల్ కొనిపెట్టవూ?" - అని అడిగాడు.

సుబ్బారావుకి కొడుకుమీద కోపమొచ్చింది - సైకిల్ బొమ్మ అడక్కుండా సైకిల్ అడిగినందుకు, మరుక్షణంలో తనమీదా, తన జీవితంమీదా కోపమొచ్చింది.

"ఛీ, ఛీ!" - అనుకున్నాడు తనలోతాను, పైకి మాత్రం - "చూద్దాంలే నాన్నా,... కొనిపెడతాలే ..." అన్నాడు - తనమాట అబద్ధమో, నిజమో తనకే నమ్మకం లేనట్టుగా.

సుబ్బారావుకి తనమీాద తనకే చాలాసార్లు నమ్మకం పోతూవుంటుంది. కాని బుచ్చిబాబు - పిల్లలందర్లోకి తన ముద్దుల కొడుకు. బుచ్చిబాబు లోగడ చాలాసార్లు చాలా కోరికలు కోరాడు. కాని అవేమీా తను తీర్చలేకపోయాడు. ఈసారైనా కొడుకు కోరిక తీర్చాలనుకున్నాడు. ఈమాత్రం చెయ్యలేకపోతే ఇంకా నా బతుకెందుకనుకున్నాడు.

అందుకే - అడ్డమైనవాళ్ళ కాళ్ళా వట్టుకుంటూ, పెళ్ళానికి మందులూ, తనకి సిగరెట్లూ కొనడం మానేసి, ఇంకా చాలా ఖర్చులున్న సంగతి బలవంతాన మర్చిపోయి, ఎలాగైతేనేం ఒక యాభై రూపాయలు సేకరించి, బుచ్చిబాబుకి మూాడుచక్రాల సైకిల్ కొనిపెట్టాడు.

o o o

పోలిగాడికి మూాడేళ్ళొచ్చాయి. మూాడేళ్ళ పోలిగాడు చూాడ్డానికి ఏడాదివాడిలా వుంటాడు. ప్రాణం వుండీ లేనట్టుగా ఉంటాడు. చూాడ్డాని కసహ్యంగా ఉంటాడు.

పోలిగాడి తండ్రి, నారిగాడికి ముప్ఫయ్యేళ్ళే అయినా చూాడ్డానికి అరవయ్యేళ్ళ వాడిలా ఉంటాడు. అరవైటన్నుల

బరువు మోస్తున్నవాడిలా ఉంటాడు. దీనంగా దిగులుగా ఉంటాడు. బతికున్న శవానికి మల్లే ఉంటాడు.

నారిగాడి పెళ్ళాం రంగమ్మ బతకలేక చాలసార్లు చచ్చిపోదామనుకుంది కాని చావలేక యింకా బతికే వుంది

నారిగాడి పెళ్ళామూ పిల్లల్తోపాటు ఒక గుడిసెకూడా వుంది. ఆ గుడిసెలో మనుషులుంటారంటే చాలామంది నమ్మరు.

నారిగాడూ, రంగమ్మాకూడా దొరికితే కూలిపని చేస్తారు. కాని కూలి దొరకదు. కూలి దొరికితే, చేసిన కూలిపనికి సరిపడా డబ్బులు దొరకవు

ఆ రోజు కూలి వెతుక్కుంటూ నారిగాడు వెళ్ళాడు, ఎక్కడకీ వెళ్ళేవోపిక లేక రంగమ్మ గుడిసెలో వోమూల చతి కిలబడి కూర్చుంది. నేలమీద దుమ్ములో పొర్లాడుతున్న మూడేళ్ళ పోలిగాడు మెల్లగా తల్లి దగ్గరకొచ్చి - మెల్ల మెల్లగా, బితుకు బితుగ్గా - "అమ్మా! బువ్వెట్టవా?" అని అడిగాడు.

రంగమ్మకి కొడుకుమీద కోపం వచ్చింది మంచినీళ్ళ దక్కుండా బువ్వడిగి నందుకు, కొడుక్కి ఏమీ సమాధానం చెప్పలేదు.

పోలిగాడు కాస్సేపాగి, తల్లివంక చూసి - ఇంకా భయంభయంగా మళ్ళీ అడిగాడు.

"అమ్మా! బువ్వెట్టవా?" - అని

రంగమ్మకి తనమీద తనకే కోపమొచ్చింది— కొడుకు బువ్వడిగితే పెట్టలేనందుకు

ఏడుపొచ్చింది—పెట్టడానికి బువ్వలేనందుకు, ఏం మాట్లాడలేకపోయింది.

పోలిగాడు మరోసారి తల్లి వంక చూసి - మరింత భయంగా, మరింత మెల్లగా, దీనంగా అడిగాడు - 'అమ్మా బువ్వెట్టవా?' అని.

రంగమ్మ చివాల్న లేచి-'ఇందాకట్నుంచీ నా పానాలు తీత్తన్నావు, బువ్వెట్టూ బువ్వెట్టూ అని, బువ్వెక్కడుందిరా నచ్చినాడా పెట్టడానికి?' అని, కొడుకు వీపుమీద గట్టిగా ఒక చరుపు చరిచి, లోపల్నుంచి వెల్లువగా పొంగివచ్చే ఏడుపు బలవంతాన ఆపుకుంటూ నేల మీద కూలబడింది.

o o o

భారత దేశంలో స్వాతంత్ర్యానికి పాతికేళ్ళు నిండ గొచ్చింది !

(దేశంలో 1972 లో స్వాతంత్ర్య రజతోత్సవాలు జరుగుతున్న సందర్భంలో రాసిన కథ)

—o—